## క్లుప్తంగా

### ఆర్‌వీఆర్‌జేసీలో ప్రారంభమైన వార్షికోత్సవం



విద్యార్థినుల నృత్యాలు

గుంటూరు రూరల్: మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు ఆయా కోర్సుల్లో వ్యక్తిత్వ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ కె రామమోహనరావు పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు కలరిడో 2023 పేరుతో జరగనున్న 38వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్య సాధన దిశగా కృషిచేయాలన్నారు. ఉల్లాసవంత జీవితానికి కళా నైపుణ్యం ఎంతో అవసరమని తెలిపారు. స్మార్ట్ ఫోన్ శరీరంలో ఒక భాగమైందని వాటిని అవసరమైనంత వరకూ మాత్రమే వినియోగించుకోవాలన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల చేరేందుకు తమ కళాశాల వేదిక కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో తెలుగు చలన చిత్ర నవ హీరో అట్లూరి రక్షిత్ ప్రతి ఒక్కరి భవిష్యత్ జీవితం విద్యపైనే ఆధారపడి ఉందన్నారు. విద్యను అశ్రద్ధ చేయొద్దని తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 1026 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథులను కళాశాల యాజమాన్యం సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### అగస్త్యేశ్వరాలయంలో శివరాత్రి మహోత్సవాలు

గుంటూరు రూరల్: మహాశివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 18వ తేదీన నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జొన్నకూటి సాయివిశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీన శనివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, రుద్ర, నవగ్రహ హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా స్వామివారి తీర్థ ప్రసాదం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. కావున భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి కృపకు పాత్రులుకావాలని కోరారు.

### పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ




గుంటూరు రూరల్: ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సును లాం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ నిషేధం ఎంతో అవసరమన్నారు. ప్లాస్టిక్‌నిషేధంపై ప్లకార్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కాటన్, పేపర్ సంచులను వినియోగించాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కె శ్రీనివాసరావు తదితరులున్నారు.

### చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

మంచాల(చేబ్రోలు): చిరుధాన్యాల్లో అనేక పోషక విలువలు ఉన్నాయని, వీటిని ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మంచిదని డీడీఏ పి రామాంజనేయులు అన్నారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో శుకవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాలను ప్రోత్సహించడానికి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శాస్త్రవేత్తలు ఎం దీప, పొన్నూరు ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవిలు మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి ఎక్కువ లాభాలు పొందవచ్చునన్నారు. 2023 సం.న్ని కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. చిరుధాన్యాలైన జొన్న, సజ్జ, రాగి, కొర్ర, వరిగ, సామ, అరిక, ఊద, అంటుకొర్రలు 9రకాలైన చిరుధాన్యాలు సాగు గురించి రైతులకు వివరించారు. సంపూర్ణ ఆరోగ్యం చిరుధాన్యాలను తీసుకోవడంతో మేలు జరుగుతుందన్నారు. ఏఓ బి శ్రీనివాస నాయక్ , వీఏఏ కె రమ్య రైతులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత**



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, వేదికపై కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయటమే మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఇంటిముందుకు అందజేస్తున్నాడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. శుక్రవారం 40 డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి అధ్యక్షతన స్వర్ణాంధ్ర నగర్ కాలనీ వాసుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలోని కాటిపాపర్లు, బుడగ జంగాలు కుటుంబ సభ్యులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని తన దృష్టికి తీసుకురావడంతో ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని స్థానిక కల్యాణ మండపంలో నిర్వహించడం జరిగిందన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉంటూ నగర నాగరికతకు దగ్గరగా ఉంటూ కూడా వారికుల వృత్తులనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న గిరిజనులుగా తమకు ప్రత్యేక గుర్తింపు ఉందని, విద్య లేకపోవడంతో ప్రభుత్వ పథకాలపై అవగాహన లేక లబ్ధి పొందలేకపోతున్నారన్నారు. వయోజన విద్యద్వారా వయస్సుతో సంబంధం లేకుండా విద్యను అభ్యసించడం వల్ల చాలా వరకూ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కాలనీలో అభివృద్ధి పనులకు ఇప్పటికే రూ. 70 లక్షలు మంజూరయ్యాయన్నారు. వీలైనంత త్వరగా కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వర్ణాంధ్రనగర్, బుడగ జంగాల కాలనీల్లో రూ 1.60 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కాలనీలో ఇప్పటికే రూ కోటి రూపాయలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్‌లు నిర్మాణం జరుగుతుందన్నారు. బీసీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్స్‌కు ఒకొక్క భవనానికి రూ. 30 లక్షల రూపాయలు మంజూరయ్యాయని పనులు జరుగుతున్నాయన్నారు. విలీన గ్రామాల తాగునీటి సమస్యలను తీర్చేందుకు గోరంట్ల కొండపై రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతన్నాయన్నారు. స్థానికంగా ఉన్న పాఠశాల స్థలానికి మెరకచేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీ వాసుల ఆధార్ కార్డులకు వారికి కాని ఆస్తులు లింక్ అయ్యి ఉన్నాయని దీంతో ప్రభుత్వ పథకాలకు అనర్హులు అవుతున్నారన్నారు. కాలనీ వాసులు మీకు అందుబాటులో ఉన్న సచివాలయంలో సమస్యల అర్జీలు ఇస్తే వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించి ఆధార్ లింక్‌లోని ఆస్తులను తలగించేందుకు ప్రభుత్వానికి పంపటం జరుగుతుందన్నారు. స్థానిక ప్రజలు చిన్న వయస్సులో వివాహాలు చేయకుండా తమ పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఈఈలు శాంతిరాజు, కొండారెడ్డి, ఏసీపీలు బాబురావు, ఏడీహెచ్ రామారావు, జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఆర్ అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, కార్పోరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, డిఈఈలు శివకుమార్, కల్యాణరావు, డీఎస్ఓ ప్రసాద్, గుంటూరు వెస్ట్ తహసీల్దారు సాంబశివరావు, టీపీఎస్ గోవర్ధన్, ఆర్‌వో బాలాజీ, బాషా, ఏఈలు రాము, రవికిరణ్, నాగవేణి, మెట్టు వెంకటప్పారెడ్డి, డబ్బారి సూర్యప్రకాశరావు, దుంపాల రాధ, కందుకూరి జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.

# సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా చూడాలి

- గృహసారథులు పథకాలను ప్రతి ఒక్కరికి తెలియ జేయాలి
- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, పాల్గొన్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



హాజరైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ గృహసారథులు

చేబ్రోలు: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను గృహ సారధులు ప్రతి ఒక్కరికి తెలియజేయాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు, వేజండ్ల గ్రామాల్లో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై గృహ సారధులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన కార్యక్రమాలు జరిగాయి. చేబ్రోలులోని పరిమి సత్యనారాయణ కల్యాణ మండపంలో చేబ్రోలులోని 1 నుంచి 5 గ్రామ సచివాలయాలు, మంచాల, శ్రీరంగపురం, గొడవర్రు గ్రామ సచివాలయాలకు చెందిన గృహ సారధులు, వలంటీర్లు, కన్వీనర్లుతో సమావేశం జరిగింది. వేజండ్ల శ్రీకృష్ణా కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో వేజండ్ల, సుద్దపల్లి, శలపాడు, శేకూరు, నారాకోడూరు, వడ్లమూడి గ్రామ సచివాలయలకు చెందిన వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులకు సమావేశం జరిగింది. ఆయా చోట్ల జరిగిన సమావేశాలకు డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు అధ్యక్షత వహించారు. చేబ్రోలు, వేజండ్ల గ్రామాల్లో జరిగిన సమావేశంలో పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ కుల, మత, వర్గ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదం ప్రతి ఇంటికి చేరాలని, రానున్న ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారధులే వైఎస్సార్ సీపీ విజయ సారధులన్నారు. పార్టీ పటిష్ఠత కోసం, ప్రజలతో మమేకం కావాలన్న లక్ష్యంతోనే పార్టీ తరుపున సచివాలయ కన్వీనర్లు, గృహసారధుల నియామకం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులందరూ కలిసి ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఎన్నికల మ్యానిఫేస్టోలో ప్రకటించిన 129 హామీలలో ఇప్పటి వరకు 128 హామీలు అమలు చేసినట్లు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. రానున్న రోజుల్లో గృహ సారధులు కష్టపడి పనిచేయాలన్నారు. రాష్ట్రంలో లక్షా 75వేల కోట్లు సంక్షేమ పథకాల కింద పారదర్శకంగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు.

**నియోజకవర్గ పరిధిలో...**

పొన్నూరు నియోజకవర్గ పరిధిలో 1500 కోట్లు సంక్షేమ పథకాలు కింద అందించినట్లు వివరించారు. విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. నాడు -నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా కార్పొరేట్ విద్యను ప్రభుత్వను పాఠశాలల్లో అందిస్తున్నట్లు తెలిపారు. వేజండ్లలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి చైతన్యపరచటం, పార్టీ అభివృద్ధికి గృహ సారధులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బి అనూరాధ, ఎంపీపీ కె సాహితి, వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, కె ఈశ్వరరెడ్డి, శనగల వెంకటరెడ్డి, సాంబశివరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ నాయకులు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గృహ సారధులు, వలంటీర్లు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత**



లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మల్లవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ ఏరువ పద్మావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి వారికి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలను వివరించారు. అదే విధంగా ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని విచారించి వారి సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో పరిష్కారాలు చూపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హత ఉంటే చాలు పథకం పొందినట్టే అన్నట్లు జగనన్న పాలన సాగుతుందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలు ఇంటికే చేరుతున్నాయన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా గ్రామంలోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలను అందుకుని సంతోసంగా ఉండడం చూడలేని చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు ప్రభుత్వంపై జగనన్నపై బురద చల్లేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగాలన్నా, ప్రతి కుటుంబం అభివృద్ధి జరగాలన్నా మన జగనన్న ముఖ్యమంత్రిగానే ఉండాలని ప్రజలకు సూచించారు. ప్రజలు రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండి చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, కార్పోరేటర్ బి స్మితపద్మజ, ఆర్ అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, ఎంపీడీఓ శోభరాణి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, వైఎస్ ఎంపీపీ దర్శి సుజాత, దుంపాల రాధ, కందుకూరి జ్యోతి, మన్నెం లక్ష్మి, ఏరువ జగన్‌మోహన్‌రెడ్డి, ఆరుదల సాంబశివరావు, రాంజీ అంబేడ్కర్, మబ్బు సుధాకర్, వంగా నవీన్‌రెడ్డి, వెంకటరావు, వెంకట్, పాపిరెడ్డి, నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులున్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకాకాని: మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పెదకాకాని ఏఈ బత్తుల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. లైన్ల మరమ్మతుల సందర్భంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పెదకాకాని మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా కోరారు.

## గ్యాస్ సిలిండర్ల వినియోగంపై అవగాహన

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని వైఎస్సార్ క్రాంత్ పథం కార్యాలయంలో శుక్రవారం కాంపోజిట్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల వినియోగంపై అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక ఉమా ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సాంబిరెడ్డి సిలిండర్ల వినియోగం, అనుకోని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవలసిన రక్షణ చర్యలు .. తదితర విషయాలపై డ్వాక్రా మహిళలకు వివరించారు. త్వరలో ఇండేన్ గ్యాస్ నుంచి కాంపోజిట్ ఎల్ పి జి సిలిండర్లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ప్రస్తుత సిలిండర్లతో పోల్చితే ఇవి 50 శాతం తక్కువ బరువుతో ఆకర్షణీయమైన లుక్ లో ఉంటాయని చెప్పారు. అంతేకాకుండా సిలిండర్‌లో ఎంత గ్యాస్ ఉందో కూడా తెలుసుకోవచ్చని చెప్పారు.

## ఉగాదికి గృహ ప్రవేశాలు

**ఎంపీడీఓ శ్రీరమ్య**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీరమ్య

ప్రత్తిపాడు: ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు చేయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీడీఓ ఏ. శ్రీరమ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టని వారు వెంటనే ప్రారంభించాలని కోరారు. ప్రత్తిపాడు లే - అవుట్‌లో ఇప్పటివరకు కేవలం 65 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారన్నారని చెప్పారు. మిగిలిన వారు ఎందుకు నిర్మించుకోలేకపోయారు, సమస్యలు ఏమిటి అన్న విషయాలు తెలుసుకునెందుకే సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఇళ్లు నిర్మించుకునెందుకు ఆసక్తి ఉన్న లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు ఉంటే డ్వాక్రా నుంచి అదనపు రుణాలను ఇప్పిస్తామని ఆమె చెప్పారు. రుణాలు ఇప్పించి, ఇళ్లు పూర్తి చేసేలా చెయ్యడమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. టాప్ ప్రయారిటీగా ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం తీసుకుందని వివరించారు. ఉగాది నాటికి 18 వేల గృహ ప్రవేశాలు చేయించాలని జిల్లా కలెక్టర్ సంకల్పంగా పెట్టుకున్నారని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ సురేష్, వైకేపీ ఏపీఎం సురేష్, సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు, వీవోఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రబీ సాగుపై ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి

పెదకాకాని: రబీ సీజన్‌లో సాగు చేపట్టిన పంటల వివరాలు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దంతాల వెంకటేశ్వరరావు అన్నారు. పెదకాకాని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఓ పి సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దంతాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీలోగా వరి కోతల తరువాత రబీ సాగుగా చేపట్టిన పంటల వివరాలను రైతులు ఈ కర్షక్ యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏలు ఈకేవైసీ చేస్తున్నారన్నారు. ఆర్‌బికేల ద్వారా పంట కొనుగోలు చేయాలంటే తప్పక ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. ఆర్‌బికేల్లో యూరియాతో పాటు పలు రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలానికి మూడు డ్రోన్ పరికరాలు మంజూరు చేసే అవకాశం ఉందని ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలోని పెదకాకాని 4, వెనిగండ్ల 2, తక్కెళ్ళపాడు గ్రూపులకు చెందిన రైతులు ముందుకు వచ్చి వ్యవసాయ పరికరాలను పొందవచ్చన్నారు.

# శివపార్వతుల కల్యాణం చూద్దాం రారండీ !

- శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఇంటింటికి వెళ్లి ఆహ్వానిస్తున్న ఆలయ సిబ్బంది
- 16 నుంచి 22 వరకు శివాలయంలో ప్రత్యేక కార్యక్రమలు
- 18న భ్రమరాంబ మల్లేశ్వరస్వామి కల్యాణం



మాజీ సర్పంచ్ ఆళ్ళ వీరరాఘవమ్మ నివాసానికి వెళ్లి ఆహ్వానిస్తున్న ఏసి, ఆలయ సిబ్బంది

పెదకాకాని: శివాలయంలో జరిగే మహా శివరాత్రి బ్రహోత్సవాలకు తప్పక రావాలంటూ పెదకాకానిలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వినూత్నంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏసి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల వేడుకలు ఈనెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వామివారి కల్యాణం ఈనెల 18వ తేదీ తెల్లవారు జామున వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పెదకాకాని గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి స్వామివారి కల్యాణానికి రావాలని ఆహ్వానించారు. సన్నాయి వాయిద్యాల నడుమ శుక్రవారం ఇంటింటికీ తిరిగి బొట్టు పెట్టి పిలుపుల క్రతువుకు శ్రీకారం చుట్టారు. స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు జాకెట్ ముక్క, కుంకుమ, విభూది, అక్షింతలు, కంకణాలు, ప్రసాదం అందజేయడం జరుగుతుందన్నారు. భక్తులందరూ ఈ కల్యాణ క్రతువులో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఏసి కోరారు. ఇంటింటికీ వెళ్లి శివపార్వతుల కల్యాణానికి గ్రామ ప్రజలను ఆహ్వానించిన వారిలో ఆలయ సిబ్బంది. స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఉన్నారు.

## 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం, యజమానితో ఎస్ఐ రవీంద్రబాబు

కాకుమాను: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం రావడంతో శుక్రవారం వేకువ జామున ఎస్ఐ డి. రవీంద్రబాబు తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన దేవరకొండ కోటయ్య అనే వ్యక్తి తనకు చెందిన మారుతి సుజికి ఏపీ 07 టీఎమ్ 6424 వాహనంలో 50 బస్తాల రేషన్ బియ్యం లోడ్‌తో బాపట్ల నుంచి పెదనందిపాడుకు వెళ్తున్నట్లు సమాచారం అందడంతో వాహన తనిఖీలు నిర్వహించి ఆటోను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. వాహన డ్రైవర్ కోటయ్యను విచారించగా కాకుమాను మండలం అప్పాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ రేషన్‌షాపు డీలర్ వద్ద రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు డ్రైవర్ తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్ పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బియ్యాన్ని రెవెన్యూ శాఖ అధికారులకు అందజేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

## ఫ్యామిలీ డాక్టర్ విధానంపై పరిశీలన



సచివాలయంలో రోగులతో మాట్లాడుతున్న జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ సుబ్బారావు

పెదకాకాని: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులు, దోమల నిల్వలను అరికట్టవచ్చని గుంటూరు జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ కెవి సుబ్బారావు అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం పరిశీలనలో భాగంగా గుంటూరు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కెవి సుబ్బారావు పెదకాకాని సచివాలయం 4 పరిధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రజలకు చేరువ చేసి వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో బాగంగా పెదకాకాని సచివాలయం పరిధిలో ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి మురుగునీరు నిల్వలు, దోమల ఆవాసాలు, చెత్తకుప్పలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ అధికారులు సహకారంతో మురుగు కాల్వలలో మురుగునీరు నిల్వలేకుండా చూడాలని, చెత్త కుప్పలను తొలగించాలని సూచించారు. వ్యాధుల నివారణపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, పిహెచ్‌సీ సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలి

**ఆర్జేడీ సుబ్బారావు**



ఎస్టీ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

పెదనందిపాడు: బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించి వారిని నాణ్యమైన విద్యను అందించాలని పాఠశాల విద్య ఆర్జేడి సుబ్బారావు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని నాగులపాడు ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్జేడి సుబ్బారావు మాట్లాడుతూ నాగులపాడు సచివాలయ పరిధిలో సుమారు 85 మంది బడి మానేసిన పిల్లలు ఉన్నారని వారు ఎందుకు బడి మానేశారని కారణాల గురించి ఎస్టీ కాలనీలో తిరుగుతూ స్థానికుల వద్ద నుంచి వివరాలు సేకరించారు. తరువాత హెచ్‌ఎం ఉమను అడిగి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఎస్టీ కాలనీలో ప్రజలు చాలా మంది పనుల కోసం బయట ప్రదేశాలకు వెళ్తున్నారని, వారు వెళ్తూ వారి పిల్లలను తమ వెంట తీసుకువెళ్తున్నారని అందువల్ల చిన్నారులు బడి మానేస్తున్నారని ఆర్జేడి తెలిపారు. తల్లిదండ్రులు వేరే చోటికి వారి పిల్లలను హాస్టల్ ఉంచి చదివించేలా వారికి అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు, స్థానికులకు తెలియజేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేలా చూడాలన్నారు. తదనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. డీఈఓ శైలజ, ఎంఈఓ డి బాల సుబ్రమణ్యం, హెచ్‌ఎం ఉమ, హాస్టల్ వార్డెన్ కరుణాకరరావు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ శంకర్, సీఆర్‌పీ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## తాగునీటి సమస్య లేని గ్రామాలే లక్ష్యం

బోడిపాలెం(కాకుమాను): దేశంలో ఏ ఒక్క గ్రామంలో తాగునీటి సమస్య లేని దేశంగా చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని జాతీయ జల జీవన్ మిషన్ కమిటీ సభ్యులు దినేష్ కుమార్ ఉపాధ్యాయ అన్నారు. మండలంలోని బోడిపాలెం, వల్లూరు, కేబీపాలెం గ్రామాల్లో ఇటీవల జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులను శుక్రవారం జాతీయ జల్ జీవన్ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా దినేష్ కుమార్ ఉపాధ్యాయ మాట్లాడుతూ దేశ ప్రజలందరికి ఉచితంగా కలుషితం లేని సురక్షితమైన రక్షిత తాగునీటిని అందించాలనే లక్ష్యంతో దేశ ప్రధాని నరేంద్ర మోదీ జల్ జీవన మిషన అనే పథకాన్ని ప్రవేశపెట్టి అనేక కోట్లు ఖర్చు చేసి దేశంలో ప్రతి ఇంటికి ఉచితంగా నీటి కుళాయిలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈపథకం ద్వారా గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి ఉచితంగా ప్రతి రోజు 55 లీటర్లు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2024 నాటికల్లా దేశంలో ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి తాగునీటి సమస్య లేని దేశంగా చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. మరో సభ్యులు రాఘవేంద్ర మాట్లాడుతూ గ్రామాల్లోని పంచాయతీ ,గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి రోజు గ్రామాల్లో పర్యటించి ప్రజలందరికి సరిపడా తాగునీరు సరఫరా అవుతుందా లేదా అనే విషయాన్ని గమనించాలని ఆయన ఆదేశించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నీటి కుళాయిలను, పని తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు నలిగల ఉషారాణి, యెషయ్య, వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తియ్యగూర వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈజి. త్రినాధ్‌బాబు, డెప్యూటీ ఈఈ ప్రసాద్, కె.కోరన్ కుమార్.ఎంపీడీఓ డి.శరత్ బాబు, ఈఓపీఆర్డి నాగానాంధ్, ఏఈ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.